బీజేపీలో జోష్



కామారెడ్డిలో టపాకాయలు కాలుస్తున్న బీజేపీ శ్రేణులు

- ఎమ్మెల్సీ ఫలితాలతో జిల్లా బీజేపీ నాయకుల్లో ఉత్సాహం
- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ విజయం
- జిల్లా పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నూతనోత్సాహం
- కలిసొచ్చిన బీజేపీ సమ్మేళనాలు
- వచ్చే స్థానిక ఎన్నికలపై దృష్టి
- సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని కోల్పోవడంతో కాంగ్రెస్ క్యాడర్‌లో నిరుత్సాహం
- నేతల మధ్య అంతర్గత కలహాలే ఓటమికి కారణమా?
- ఎల్లారెడ్డి, బాన్సువాడలో కాంగ్రెస్‌కు లీడ్

కామారెడ్డి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించడంతో ఆ పార్టీలో జోష్ నెలకొంటుంది. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి మొదలుకొని పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బీజేపీ సత్తా చాటుతుండడంతో రాబోయే స్థానిక ఎన్నికల్లోనూ విజయం తమదేనని ఆ పార్టీ క్యాడర్ భావిస్తోంది. వరుస విజయాలతో జిల్లా బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంటుంది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలపై బీజేపీ పాగా వేయడం ఆ పార్టీకి మరింత కలిసిరానుంది. అయితే కాంగ్రెస్‌కు సిట్టింగ్ పట్టభద్రుల స్థానాన్ని కోల్పోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం నెలకొంటుంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థి బరిలో దిగడం అధికారంలో ఉన్నప్పటికీ గెలువకపోవడం ఏమిటని పార్టీ శ్రేణుల్లో చర్చ మొదలైంది. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పార్టీ ముఖ్యనేతల మధ్య అంతర్గత కలహాలతో పోల్ మేనేజ్‌మెంట్ చేయలేదనే వాదన పార్టీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది. అయితే బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మాత్రం బీజేపీ కంటే కాంగ్రెస్‌కే లీడ్ వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

బీజేపీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కమలనాథుల్లో జోష్ నింపింది. రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడం ఆ పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. ఎమ్మెల్సీ పోరులో నువ్వా నేనా అన్నట్లు తలపడగా బీజేపీ బలపరిచిన అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డిలకే ఉపాధ్యాయులు, పట్టభద్రులు పట్టం కట్టారు. జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారిగా కామారెడ్డి నుంచి బీజేపీ గెలుపొందగా మరోసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటింది. గత రెండేళ్లుగా బీజేపీకి అనుకూల పవనాలే వీస్తున్నాయి. దీంతో భవిష్యత్తులో తమ పార్టీ బలపడుతుందనే సంకేతాలు వస్తున్నాయని క్యాడర్‌లో ఉత్సాహం నెలకొంటుంది. గత కొంత కాలంగా పార్టీ పుంజుకోవడంపై ఎన్నో ఏళ్లగా ఇక్కడ పాగా వేయాలనుకున్న పార్టీ సీనియర్‌లకు ఊరట కలుగుతోంది. మరోవైపు తాజా ఎన్నికలతో యువత విద్యావంతులు, టీచర్లు బీజేపీ వైపు ఉన్నారని ఆ పార్టీ శ్రేణులు చెప్పుకుంటున్నాయి.

కలిసొచ్చిన ఆత్మీయ సమ్మేళనాలు

పట్టభద్రుల, ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మొదటి నుంచి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేశారు. గత అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లో బీజేపీ అభ్యర్థులకే ఓట్లు ఎక్కువ రావడంతో ఆ అంచనాలతో ఈసారి ఎమ్మెల్సీ బరిలో బీజేపీ అభ్యర్థులను దింపి స్థానిక నాయకులపై భారం వేసింది. అభ్యర్థులపై మొదట్లో కాస్త వ్యతిరేకత నెలకొన్నప్పటికీ బీజేపీ క్యాడర్ క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టారు. పార్టీ సైతం ముందుగానే అభ్యర్థులను ఖరారు చేయడంతో పార్టీ శ్రేణులు నేరుగా ఓటర్ల వద్దకు వెళ్లి తమవైపు తిప్పుకోవడంలో వారి వ్యూహాలు ఫలించాయి. అదేవిధంగా అభ్యర్థుల తరఫున పట్టణాలు, నియోజకవర్గాల్లో ఓటర్లను అధిక సంఖ్యలో రప్పించి కేంద్ర మంత్రులైన బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, డీకే అరుణ, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించడం గెలుపునకు దోహదం చేశాయనే చెప్పవచ్చు.

వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ..

జిల్లా వ్యాప్తంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీజేపీ సిద్ధమవుతోంది. ఇప్పటికే కొత్త జిల్లాల అధ్యక్షులు, నియోజకవర్గం, మండల, పట్టణ, గ్రామాలు బూత్ స్థాయిలో బాధ్యతలు అప్పగించారు. పట్టణాలకే పరిమితమైన ఓటు బ్యాంకును గ్రామాల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేనే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తాజాగా ఇద్దరు ఎమ్మెల్సీలు ఉమ్మడి జిల్లాల నుంచి గెలుపొందారు. దీంతో వీరు రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా బీజేపీ బలపడేందుకు సరైన సమయం వచ్చిందని కార్యకర్తలు భావిస్తున్నారు. ఇన్నాళ్లు పట్టణాలకే పరిమితమైన పార్టీ ఇక గ్రామ స్థాయిలోనూ విస్తరిస్తోందని ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో నైరాశ్యం

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ సిట్టింగ్ స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోవడంతో ఆ పార్టీ క్యాడర్‌లో కాస్త నైరాశ్యం నెలకొంటుంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆ స్థానంలో కాంగ్రెస్ పార్టీలో బరిలో దిగిన జీవన్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందిన విషయం తెలిసిందే. ఈయన పదవి త్వరలో ముగియనుంది. ఈలోపే ఎన్నికలు నిర్వహించగా కాంగ్రెస్ నుంచి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి బరిలో దిగారు. అధికార పార్టీ నుంచి పోటీ చేయడంతో గెలుపు ఖాయమని ఆ పార్టీ వర్గాల్లోనే కాకుండా అంతటా చర్చ జరిగింది. కానీ బీజేపీ గట్టిపోటీని ఇచ్చింది. కాంగ్రెస్ అభ్యర్థి తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు జూపల్లి కృష్ణారావు లాంటి వారు ప్రచారం చేసినా నరేందర్‌రెడ్డికి గెలుపు దక్కలేకపోయింది. అయితే ఓటమికి కారణం పార్టీలోని ముఖ్యనేతల మధ్య అంతర్గత కలహాలేనని ఆ పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఉమ్మడి జిల్లాల నుంచి అన్ని నియోజకవర్గాల్లో మెజార్టీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందిన వారే ఉన్నప్పటికీ సిట్టింగ్ ఎమ్మెల్సీ స్థానం కోల్పోవడం ఏంటని ఆ పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఇప్పటికైనా ముఖ్యనేతలు అంతర్గత కలహాలు వీడి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేలా చూడాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

రేపు జాతీయ లోక్‌అదాలత్

కామారెడ్డి టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం 7 బెంచీలతో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి తెలిపారు. కక్షిదారులు, రాజీపడదగిన కేసులను రాజీ కుదుర్చుకోవాలని తెలిపారు. ప్రత్యామ్నాయ వివాదాల పరిష్కార మార్గాల్లో లోక్‌అదాలత్ ఒకటి అని అన్నారు. లోక్‌అదాలత్ ద్వారా జ్యుడీషియల్ అధికారులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలతో కూడిన లోక్‌అదాలత్ బెంచ్‌లు వారికి సూచించబడిన కేసులను పరిష్కరిస్తాయని తెలిపారు. సెటిల్‌మెంట్‌కు చేరుకోవడంలో పార్టీలకు సహాయ పడతాయని తెలిపారు. లోక్‌అదాలత్‌లకు ఏదైన కోర్టు ముందు పెండింగ్‌లో ఉన్న ఏదైన కేసు లేదా ఏదైన కోర్టు అధికార పరిధిలోకి వచ్చే కోర్టు ముందుకు తీసుకురాని ఏదైన విషయాన్ని సంబంధించి వివాదానికి సంబంధించిన పార్టీల మధ్య రాజీ లేదా పరిష్కారాన్ని నిర్ణయించడానికి ఈ లోక్‌అదాలత్ పని చేస్తుందని తెలిపారు. సివిల్ కేసులు, వైవాహిక వివాదాలు, భూ వివాదాలు, విభజన, ఆస్తి వివాదాలు, కార్మిక వివాదాలు, బ్యాంకు రివరీలు తదితర వాటిని పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే వేదిక కావున కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు.

హంస వాహనంపై ఊరేగిన శ్రీనివాసుడు

- శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం



ఉత్సవ విగ్రహాలను హంస వాహనంపై ఊరేగిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బీర్కూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ శివారు, తిమ్మాపూర్ గ్రామ సమీపంలోని తెలంగాణ తిరుమల దేవస్థానంలో గోదా సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దశమ బ్రహ్మోత్సవాలు నేత పర్వంగా కొనసాగు తున్నాయి. ఆలయ ధర్మకర్తలు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు, ఆయన సోదరుడు శంభురెడ్డి దంపతులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 7 గంటలకు దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారిచే తీర్థ గోష్ఠి, శాంతి పాఠం, ద్వారా తోరణ పూజ, ధ్వజ కుంభారాధన, నిత్య హవనం, పూర్ణాహుతి, బలిహరణం, తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాలు నిర్వహి ంచారు. స్వామి వారు భక్తులనుద్దేశించి ప్రవచనాలు చేశారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో స్వామి వారిని హంస వాహనంపై ఊరేగించారు. స్వామి వారు హంస వాహనంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. ఇదిలా ఉండగా సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ద్వారాతోరణ పూజ, ధ్వజ కుంభారాధన, నిత్యాహవనం, పూర్ణాహుతి, బలిహరణం, తీర్థ ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో రథోత్సవం నిర్వహి ంచారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి తరించారు. ఆలయ సన్నిధిలో మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అప్పారావు, మురళి, రాంబాబు, నరసరాజు, నాగేశ్వర్‌రావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు, నాయకులు

కామారెడ్డి టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు, ఏరియర్స్, పీఎఫ్, ఈఎస్‌ఐలు వెంటనే కార్మికుల ఖాతాలో జమ చేయాలని, అకారణంగా తొలగించిన 12 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణ్, నర్సింగ్, అయాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలి

ఎస్పీ సింధూశర్మ



ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఎస్సై అనిల్

కామారెడ్డి టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని ఎస్పీ సింధూశర్మ జిల్లా పోలీసులకు సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారి నేర సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని అన్నారు. ప్రతీ అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్‌మెంట్ తెలిసి ఉండాలని తెలిపారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని తెలిపారు. కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. ఫంక్షనల్ వర్టికల్స్ అమలుపరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందజేయాలని తెలిపారు. కమ్యునిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీ టీవీల యొక్క ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్‌క్రైమ్, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాలు జరగకుండా ప్రతిరోజూ డ్రంకెన్‌డ్రైవ్‌లు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో దొంగతనాలు జరగకుండా పగలు, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌లు చేస్తు ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెడుతూ విజిబుల్ పోలిసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పోలీసులకు ప్రశంసా పత్రాలు


విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీ సులకు ఎస్పీ ప్రశంసా పత్రాలను అందించా రు. ఇందులో మాచారెడ్డి ఎస్‌ఐ అనిల్, ఎల్లారెడ్డి ఏఎస్‌ఐ గంగారెడ్డి, భిక్కనూరు ఉమెన్ కానిస్టేబుల్ ప్రియాంక, బీబీపేట కానిస్టేబుల్ రాములు, కామారెడ్డి కానిస్టేబుల్ విజయ్, దేవునిపల్లి ఉమెన్ కానిస్టేబుల్ శిరీష, దేవునిపల్లి కానిస్టేబుల్ నవీన్, నాగిరెడ్డిపేట కానిస్టేబుల్ చంద్రయ్య, తాడ్వాయి పోలీసుస్టే షన్ కానిస్టేబుల్ సాయిబాబా, భవిత, చంద్రయ్య, రవీందర్, నదీమ్, వెంకటేశ్వర్లు, జావిద్‌లు ఉన్నారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు నరసింహారెడ్డి, చైతన్యారెడ్డి, డీఎస్పీలు సత్యనారాయణ, శ్రీనివాసులు, ఎస్‌బీ సీఐ తిరుపయ్య, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ మురళి, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా
అక్రమ కలప రవాణా
- పేరుకే టింబర్ డిపోలు, లోపల మొత్తం జీరో మాల్
- వాల్టా చట్టానికి తూట్లు 7
- పట్టించుకోని అటవీ శాఖ అధికారులు



రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
ఇఫ్తార్ సా.6.30	సహర్ ఉ.5.08



అల్లాహ్ పశ్చాత్తాప పడే వారిని ప్రేమిస్తాడు. పరిశుద్ధులుగా ఉండేవారిపైనే తన కరుణ చూపుతాడు.



ట్రెజరీకి బిల్లుల తాకిడి

- ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో పెండింగ్ బిల్లుల దాఖలు
- ఉద్యోగుల టీఏ బిల్లులతో పాటు శాఖల వారీగా వస్తున్న బడ్జెట్ బిల్లులు
- ఆర్థిక శాఖ నిర్ణయం మేరకే బిల్లుల చెల్లింపులు


నిజామాబాద్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో ట్రెజరీలో బిల్లుల తాకిడి పెరుగుతోంది. శాఖల బిల్లులే కాకుండా ఉద్యోగుల బిల్లులు ఎక్కువగా చెల్లింపుల కోసం వస్తున్నాయి. టీఏ బిల్లులతో పాటు ఆయా శాఖల ఖర్చుల బిల్లులు కూడా ఎక్కువ మొత్తంలో పంపిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం చివరిలోపే అన్ని బిల్లుల చెల్లింపులు జరిగే అవకాశం ఉండటంతో శాఖల వారీగా ప్రతీరోజు పంపిస్తున్నారు. జిల్లా ట్రెజరీకి ఆన్‌లైన్ ద్వారా వస్తున్న బిల్లులను ఫైనాన్స్ శాఖకు పంపిస్తున్నారు. బిల్లులన్నీ చెల్లింపులు ఆర్థిక శాఖ చేస్తుండటంతో ముందస్తుగానే శాఖల వారీగా ఈ బిల్లులను పెడుతున్నారు. వీరితో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కూడా తమకు సంబంధించిన బిల్లులను చెల్లింపుల కోసం పంపిస్తున్నారు. ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రికి వెళ్లిన ఉద్యోగులు కూడా మెడికల్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను చెల్లించాలని సంబంధిత బిల్లులను దాఖలు చేస్తున్నారు. ప్రభుత్వం పరిధిలోనే బిల్లుల చెల్లింపు జరుగుతుండటంతో ఆయా శాఖల్లోని ఉద్యోగులు గత 11 నెలలకు సంబంధించిన పెండింగ్ బిల్లులను పంపిస్తున్నారు. ఆర్థిక సంవత్సరం చివరిలో కొంత మొత్తంలో చెల్లింపులైనా తమకు కలిసి వస్తాయని భావిస్తున్నారు. ఒకేసారి బిల్లులు పెరగడంతో ట్రెజరీ అధికారులు కూడా ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించి పంపిస్తున్నారు.

పెరిగిన పెండింగ్ బిల్లుల తాకిడి

ఆర్థిక సంవత్సరం 2024-25 ఈనెల 31తో ముగుస్తుండటంతో ట్రెజరీలో బిల్లుల తాకిడి పెరిగింది. నెల ఆరంభం నుంచే అన్ని శాఖలకు సంబంధించిన బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. ఆయా శాఖల్లో గత 11 నెలలుగా పెట్టిన ఖర్చులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ట్రెజరీలో సబ్మిట్ చేస్తున్నారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన వేతనాలు, ఇతర బిల్లులు కూడా ఉంటున్నాయి. ఇవే కాకుండా ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ బిల్లులను ఎక్కువగా పెడుతున్నారు. ఉద్యోగులకు సంబంధించిన టీఏతో పాటు వాహనాలకు సంబంధించిన రెంట్ల బిల్లులను పంపిస్తున్నారు. ప్రతీనెల ఆయా శాఖల ద్వారా బిల్లులు పెట్టినా కొన్ని మాత్రమే వచ్చి మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటం వల్ల అన్ని బిల్లులు క్లియర్ చేసే అవకాశం ఉండటంతో బడ్జెట్ బిల్లులు కూడా ఎక్కువగా ఖర్చు పెడుతున్నారు. కేటాయించిన బడ్జెట్‌కు అనుగుణంగా 11 నెలల్లో ఖర్చు పెట్టిన వాటితో పాటు మిగిలిన వాటిని కూడా ఈనెలలో ఖర్చు చేసేందుకు ఆయా శాఖల అధికారులు సిద్ధమవుతున్నారు.

ముఖ్యమైన బిల్లులు మాత్రమే చెల్లింపులు

గతంలో కొన్ని శాఖలకు బడ్జెట్ బిల్లులు క్వాటర్లీ బేసిస్‌లో చెల్లింపులు చేసే వారు. గత కొన్ని నెలలుగా ముఖ్యమైన బిల్లులను మాత్రమే చెల్లింపులు చేస్తున్నారు. ఉద్యోగుల జీతాలు మొదట అందిస్తున్నా టీఏ బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని శాఖల్లో ఉద్యోగులవి మూడు నాలుగు నెలల వరకు పెండింగ్‌లో ఉండగా మరికొన్ని శాఖల పరిధిలో ఆరు నెలల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధాన శాఖలను మినహాయిస్తే మిగతా శాఖల్లో పెండింగ్ ఎక్కువగా ఉంటున్నాయి. బడ్జెట్ బిల్లు ఎక్కువగా ఉంటే అవి మం జూరు కావడం లేదు. రాష్ట్రస్థాయిలో ఉన్నతాధికారులతో చెప్పిం చుకున్న బిల్లులే ఎక్కువగా క్లియర్ అవుతున్నాయి. వాటికి చెల్లింపులు జరుగుతున్నాయి. ఇలాంటి బిల్లులు ఎక్కువగా ఉండటం వల్ల కొన్ని శాఖల పరిధిలోనే ఎక్కువ మొత్తంలో చెల్లింపులు అయ్యాయి. మిగతా శాఖలవి పెండింగ్‌లో ఉండటం వల్ల ఆ బిల్లులన్నీ ఈనెల ఆరంభం నుంచే ఎక్కువగా సబ్మిట్ చేస్తున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన బడ్జెట్ బిల్లు ఈనెలాఖరులోపు రూ.200 కోట్ల వరకు ఉండే అవకాశం ఉన్నట్లు ట్రెజరీ అధికారులు ఇచ్చిన సమాచారం బట్టి తెలుస్తోంది. ఇప్పటి వరకు వచ్చిన బిల్లులే వంద కోట్ల వరకు ఉన్నట్లు తెలుస్తోంది. శాఖల వారీగా బిల్లులు వస్తుండటంతో ట్రెజరీ శాఖ అధికారులు ప్రాసెస్ చేసి పంపిస్తున్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్ వస్తుండగా గ్రాట్యుటీ చెల్లింపులు మాత్రం ఆలస్యమవుతున్నాయి. ఇవే కాకుండా ఆసుపత్రులకు సంబంధించిన ఉద్యోగ బిల్లులు కూడా ఎక్కువ మొత్తంలో సబ్మిట్ చేశారు. అవి కూడా ఈనెలలో మంజూరయ్యే అవకాశం ఉండటంతో బిల్లులు పెరుగుతున్నాయి. బడ్జెట్ బిల్లులు ఈనెలాఖరులోపు ఎక్కువ మొత్తంలో వచ్చే అవకాశం ఉందని ట్రెజరీ అధికారులు తెలిపారు. ఆయా శాఖల పరిధిలో పెట్టిన బిల్లులు మంజూరైతే చాలు అనే రీతిలో అధికారులు వేచి చూస్తున్నారు. జిల్లా నుంచి ప్రాసెసై పంపిస్తున్నా ఆర్థిక శాఖ క్లియర్ చేస్తుండటం వల్ల ఏ బిల్లులు ఎప్పుడు వస్తాయో చెప్పని పరిస్థితి జిల్లా కార్యాలయంలో ఉంది. ప్రతీ సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా శాఖలకు సంబంధించిన బిల్లులను చెల్లింపుల కోసం పంపిస్తున్నట్లు ఆయా శాఖల అధికారులు తెలిపారు. నెలాఖరులోపు కొన్ని మంజూరైనా మిగతా బిల్లులు వచ్చే నెలలో క్లియర్ చేసే అవకాశం ఉందని వారు తెలిపారు.



'సేంద్రీయ ఎరువులతో మేలు'



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి మారుతి

కమ్మర్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ ఎరువుల వాడకం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, భూసారం పెరగడంతో పాటు అధికదిగుబలు అందుతాయని ఐకేపీ వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మారుతి పేర్కొన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన మహిళా సంఘాల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలకు రసాయన ఎరువుల వాడకంతో భూసారం తగ్గిపోతూ దిగుబడి ఆశించిన విధంగా పొందలేకపోతున్నారని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తునందున స్త్రీనిధి బ్యాంక్ రుణాలు వందశాతం రికవరి జరిగేలా చూసుకోవాలని ఏపీఎం కుంట గంగారెడ్డి అన్నారు. సమావేశంలో జిల్లా ఫామ్ ఏపీఎం వరికుమార్ బాల్కొండ మహిళా ఉత్పత్తుల సమాఖ్య చైర్మన్ గంగాలక్ష్మీ, డైరెక్టర్ చౌట్‌పల్లి గంగమ్మ, సీసీలు రవికుమార్, వర్షం శ్రీనివాస్, నవీన్ కుమార్, భాగ్యలక్ష్మీ, పీర్య, అలే ఖ్య, స్త్రీనిధి సహయ మేనేజర్ రేణుక, ఆపరేటర్ అనసూయ, వీవోఏలు పాల్గొన్నారు.

'ఫిర్యాదుల బాక్స్‌ను వినియోగించుకోవాలి'



భోజనాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో, తహసీల్దార్

కమ్మర్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఏవైనా సమస్యలను ఎదుర్కొంటుంటే తమ సమస్యలను పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టేద్వారా సమస్యలు తెలుపవచ్చని కమ్మర్‌పల్లి ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ విద్యార్థులకు సూచించారు. గురువారం కమ్మర్‌పల్లి కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పిర్యాదుల పెట్టేను తెరిచి అందులో ఎలాంటి ఫిర్యాదులు లేకపోవడంతో సమస్యలు లేవా అని అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చని చెప్పారు. అనంతరం వంటశాలను పరిశీలించడంతో పాటు విద్యార్థుల కోసం వండిన వంటలను పరిశీలించి స్టాక్‌రూంను తనిఖీ చేశారు. అనంతరం పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీఫైనల్ పరీక్షలు రాసేవిధానాన్ని పరిశీలించారు. పదోతరగతి వార్షిక పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున కష్టపడి చదివి ఉత్తమమార్కులు సాధించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన రుచికరమైన భోజనాలు అందించాలని ఆదేశించారు.

మొరం తరలించొద్దని గ్రామస్తుల ధర్నా



చెరువు వద్ద ధర్నా నిర్వహిస్తున్న నీలా గ్రామస్థులు

రెంజల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా గ్రామంలో గల ఖజానా కుంట చెరువు నుంచి మొరం తరలించవద్దని గ్రామస్థులు గురువారం మొరం తవ్వకాలను అడ్డుకున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు మొరం తరలిస్తున్నారని మొరం తరలింపుతో చెరువు అధిక లోతు తవ్వడంతో ఇబ్బందులు ఎదురవుతున్నారని గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. సమాచారం తెలుసుకొన్న ఇరిగేషన్ డీఈ బలరాంతో పాటు ఎస్ఐ సాయన్నలు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పి టిప్పర్లతో పాటు జేసీబీని అక్కడి నుంచి తరలించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మొరం తరలించవద్దని, ప్రభుత్వ అనుమతి ఉంటేనే తరలించాలని డీఈ బలరాం సూచించారు. ప్రభుత్వ పనులకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని సూచించారు. నీలా గ్రామంలోని చెరువు నుంచి మొరం తరలిస్తున్న ఏడు టిప్పర్లను ఇరిగేషన్ డీఈ బలరాం స్వాధీనం చేసుకుని రెంజల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం తరలింపు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణం

రెంజల్,మార్చి6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు మండల పరిషత్ పాఠశాలలో గురువారం మరుగుదొడ్ల నిర్మాణానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగభూషణం రెడ్డి, యూత్ కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీక్ యాదవ్‌లు భూమిపూజ నిర్వహించారు. మండల కేంద్రంలోని విద్యార్థులకు సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిబాబా గౌడ్, కుర్మె శ్రీను, అబ్బోళ్ల శ్రీకాంత్, గైని కిరణ్, శివ, శ్రీకాంత్, కృష్ణ, శరత్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో బియ్యం పట్టివేత

బోధన్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అనీ సానగర్ గోదాంలో అక్రమంగా నిల్వఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ స్పెషల్ పార్టీ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రెండున్నర టన్నుల బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందన్నారు. గోదాం యజమానిని అరెస్టు చేసి పోలీసులకు అప్పగించామని వారు తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోడప్రతుల ఆవిష్కరణ

మోర్తాడ్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాయల సుబాష్‌చంద్రబోస్ 9వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. మాస్ లైన్ ప్రజాపంథ జిల్లా నాయకులు జి.కిషన్ మాట్లాడుతూ ఈనెల 9న రాయల్ సుబాష్‌చంద్రబోస్ 9వ వర్ధంతి సభను విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు, ఈనెల 9న జరిగే ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రానికి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

● అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి అంకిత్

ఆర్మూర్‌టౌన్, మార్చి6(ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో ప్రజలకు మంచినీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి అంకిత్ అన్నారు. గురువారం పట్టణంలోని జిరాయత్‌నగర్‌లో జరుగుతున్న మంచినీటి మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ప్రతీవిభాగంలోకి కలియ తిరిగి ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రాజుకు సూచించారు.

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ స్థలాలను అదనపు కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఆర్మూర్ మండలం కోమన్‌పల్లి గ్రామాన్ని ప్రభుత్వ పథకాల అమలుకు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా 97 మంది



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

లబ్ధిదారులను అర్హులుగా నిర్ధారించారు. వీరిలో పదిమంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చారు. మార్కవుట్ చేసిన ఇళ్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు పనులను త్వరగా



ఇళ్ల నిర్మాణ స్థలాలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ప్రారంభించాలని సూచించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరగా ప్రారంభిస్తే ప్రభుత్వం నుంచి విడతల వారీగా నిధులు మంజూరవుతాయని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ అధికారులు, తదితరులు ఉన్నారు.

జక్రాన్‌పల్లిలోనే నవోదయ పాఠశాల ఏర్పాటు

● కాంగ్రెస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి

జక్రాన్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మంజూరైన జవహర్ నవోదయ పాఠశాల జక్రాన్‌పల్లిలోనే ఏర్పాటు అవుతుందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైడి చిన్నారెడ్డి స్పష్టం చేశారు. గురువారం జక్రాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జక్రాన్‌పల్లి, నారాయణపేట్ గ్రామాల మధ్య 20 ఎకరాల భూమిని, కలిగోట్‌లో ఇటీవల కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పరిశీలించారని తెలిపారు. కలిగోట్‌లో నవోదయ పాఠశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు దూరమవుతుందనే ఉద్దేశంతో హైవేకు దగ్గరగా ఉన్న జక్రాన్‌పలిలోని జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులచారి చేసిన ఆరోపణలు తప్పన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో రెబల్స్ ఉండడంతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఓడిపోయాడన్నారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి మోగిస్తుందన్నారు. సమావేశంలో రూరల్ యువజన విభాగం కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్, అర్గుల్ సింగిల్‌విండో చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వసంత్‌రావు, మాజీసర్పంచ్‌లు కాట్‌పల్లి నర్సారెడ్డి, కిషన్‌నాయక్, మాజీఎంపీటీసీలున్నారు.

నవోదయను తరలించవద్దని నిరసన



జక్రాన్‌పల్లిలో బోధన్ ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జక్రాన్‌పల్లి, మార్చి6 (ఆంధ్రజ్యోతి): జక్రాన్‌పల్లికి మంజూరైన జవహర్ నవోదయ పాఠశాలను బోధన్‌కు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని నిరసిస్తూ గురువారం జక్రాన్‌పల్లిలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. మంజూరైన నవోదయ పాఠశాలను జక్రాన్‌పల్లిలోనే ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు తేల్చిచెప్పారు. లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని, ప్రభుత్వాన్ని బీజేపీ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, బీజేపీ నాయకులు క్యాతం రాజారెడ్డి, తిరుపతిరెడ్డి, అశోక్, సంతోష్, శ్రీనివాస్‌గౌడ్ కార్తిక్ పాల్గొన్నారు.

'ఎంపీ అనుచిత వ్యాఖ్యలు సరికాదు'



బోధన్‌లో బీజేపీ ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అనుచితవ్యాఖ్యలు చేయడం సరికాదని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎంపీ అరవింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై, రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డిపై ఎంపీ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, నాగేశ్వర్ రావు, మందర్నా రవి, దాము, అల్లె రమేష్, చిరంజీవి, హరికాంత్ చారి, గుండెటి శంకర్, వీరభద్రరావు, సంజీవ్ రెడ్డిలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులున్నారు.

వేల్పూర్ : జిల్లాలో నవోదయ పాఠశాల మంజూరు గురించి ఎలాంటి ప్రతిపాదన చేయని ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ నాయకులు బోధన్ ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదన గురించి మాట్లాడడం విడ్డూరమని డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం వేల్పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే చేసిన ప్రతిపాదన గురించి మాట్లాడే అర్హత ఎంపికి లేదన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్, గొరాయి నరేందర్, రమణ, కుమ్మరి రాజన్న, పన్నాల యేష్‌పాల్, మల్లేష్, ఆర్మూర్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీ అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్ యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి మాట్లాడుతూ ఎంపీ అరవింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జిల్లా అభివృద్ధికి అనేక విధాలుగా కృషి చేసిన ఘనత ఉందన్నారు. జిల్లా కేంద్రానికి మెడికల్ కాలేజీతో పాటు జిల్లా ఆసుపత్రిని అభివృద్ధిని చేశారన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోకే బోధన్ నియోజకవర్గం వస్తుందని ఎంపీ అరవింద్ గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంఎల్ రాజు, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, మోహన్, రవి, సాయిలు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గైని కిరణ్, జంగం గంగాధర్, శంకర్, షంషోద్దీన్, సోషల్ మీడియా నాయకులు శ్రీకాంత్, లోక కృష్ణ, శివ పాల్గొన్నారు.

ఎడపల్లి : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిపై బుధవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ గురువారం మండల కాంగ్రెస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని పాత బస్టాండు వద్ద ఎంపీ ధర్మపురి అరవింద్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ జక్రాన్‌పల్లి ఒక్క మండలానికే ఎంపీ అన్నట్లు ప్రవర్తిస్తున్నాడని, బోధన్‌కు కూడా అతను ఎంపీ అని మర్చి పోయాడన్నారు. సుదర్శన్ రెడ్డి జిల్లా అభివృద్ధికి పాటు పడ్డాడని, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. ఎంపీగా రెండోసారి గెలిచిన మీరు జిల్లాకు చేసిన అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పులి శ్రీనివాస్ రావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగం, నాయకులు ఎల్లయ్య యాదవ్, సత్యనారాయణ, బంజ కామప్ప, కంచరి శ్రీనివాస్, స్వామిగౌడ్ ఉన్నారు.

అంతటా బీజేపీ సంబురాలు



బోధన్‌లో మాట్లాడుతున్న నాయకులు

బోధన్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు నరేంద్ర మోడీవైపే ఉన్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, మోహన్ రెడ్డిలు అన్నారు. గురువారం బోధన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించిన నేపథ్యంలో టీచర్లు, పట్టభద్రులంతా ప్రధాని మోడీవైపే ఉన్నారని, వారికి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై నమ్మకం లేదని ఆయన పేర్కొన్నారు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ గెలవడం ఒక చారిత్రక విజయమని పేర్కొన్నారు. మొన్న మల్క కొమురయ్య, నేడు అంజిరెడ్డి గెలుపుతో ఉత్తర తెలంగాణలో బీజేపీ చరిత్ర సృష్టించిందన్నారు. బోధన్ నియోజకవర్గంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గెలుపుతో బీజేపీలో జోష్ నెలకొందని, వచ్చే స్థానిక ఎన్నికలలో ఇదే రీతిలో పని చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఏర్గట్ల : టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడంతో మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ఏలేటి నారాయణ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించినందుకు టీచర్స్, పట్టభద్రులకు కృత జ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆనందం గంగేశ్వర్, గుండ విఠల్, తోకల వంశీ, శ్రీను, భూమేష్ పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్ : ఆర్మూర్‌లోని అంబేద్కర్‌చౌరస్తాలో విజయోత్సవ సంబరాలు గురువారం నిర్వహించారు. సీనియర్ నాయకులు లోకభూపతిరెడ్డి మాట్లాడుతూ ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సూచనల మేరకు ప్రతీ కార్యకర్త విజయం కోసం శ్రమించారని, వారికి ప్రత్యేక ధన్యవా దాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీచైర్మన్ కంచెట్టి గంగాధర్, జిల్లా అధికార ప్రతిని ధులు జెస్సు అనిల్, కలిగోట గంగాధర్, నూతుల శ్రీని వాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, మాజీకౌన్సిలర్‌లు ఆకుల శ్రీనివాస్, సాయి, ఉదయ్, రోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్ : మండల కేంద్రంలోని మోర్తాడ్ జాతీయ రహదారిపై గురువారం బీజేపీ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు పుప్పాల నరేష్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనేది ఈ గెలుపునకు తార్కాణమని అన్నారు. నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బోగ దేవేందర్, తీగెల రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాగర్, మోహన్, గంగారెడ్డి కోరం ప్రకాష్, జైడి గంగారెడ్డి, లక్ష్మీనర్సయ్య, శేఖర్ పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండల బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ నాయకులు టపాకాయలు కాల్చిస్వీట్లు పంచుకొని సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీగౌడ్, మండల మాజీఅధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, బీజేపీనాయకులు కార్తిక్, రాజారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బోధన్‌రూరల్ : బోధన్‌లో గురువారం అంబేద్కర్ చౌరస్తాలో టపాకాయలు కాలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. సాలూర మండల కేంద్రంతో పాటు అమ్దాపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు టపాకాయలు కాలుస్తూ విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అభ్యర్థులు గెలుపొందడం శుభసూచకమని పేర్కొన్నారు. బోధన్ నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంగ్రాం పటేల్, బీజేపీ పట్టణ అధ్యక్షులు కొలిపాక బాలరాజు, సుధాకర్ చారి, వినోద్, అరవింద్, వాసు, గోపికిషన్, హన్మాండ్లు చారి, గుంత గంగాధర్, అశోక్ గౌడ్, మందర్నా మాజీ సర్పంచ్ రావుబా గంగాధర్ పాల్గొన్నారు.

కోటగిరి : మండల కేంద్రంలో బీజేపీ నాయకులు గురువారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ అఖండ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పాత బస్టాండ్ వద్ద బాణాసంచాలు కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. బీజేపీ మండల అధ్యక్షులు నవీన్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో బీజేపీ పార్టీ అభ్యర్థులను ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఆశీర్వదించి భారీమెజార్టీతో విజయం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలోకి



ఆర్మూర్ సంబరాల్లో బీజేపీ నాయకులు

రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మోహన్ రావు, హాగిర్ రావు దేశాయ్, శ్యామల, రాజు, శ్రీను, సాయిలు, గంగాధర్, రమేష్, మధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికలలో విజయం సాధించడం పట్ల సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగం సాయిలు, భజరంగ్ హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, శంకర్, రామరాజు, గజేందర్, సాయినాథ్, గణేష్ పాల్గొన్నారు.

ఎడపల్లి: మండల కేంద్రంలోని పాత బస్టాండు వద్ద గురువారం బీజేవైఎం ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమరయ్యలు విజయం సాధించడంతో బీజేవైఎం ఎడపల్లి మండల నాయకులు టపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో మండల బీజేవైఎం అధ్యక్షులు సాయి, నాయకులు బర్దిపూర్ ప్రణయ్, కట్కం శంకర్, బట్టు రాజు, బూత్ అధ్యక్షులు అరుణ్, కంజరి ప్రదీప్, వేణు, వీరేంధర్, సుధాకర్, అమర్, అనిరుధ్, రఘు, సురేష్, శేఖర్ ఉన్నారు.

నవీపేట : మండల కేంద్రంలో సంబరాలు జరుపుకున్నారు. అంజిరెడ్డి, కొమురయ్య విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పెద్దఎత్తున బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, వంశీ మోహన్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, ఆనంద్, గణేష్, శ్రీకాంత్, భూషణ్, రాము, ప్రవీణ్, రాజశేఖర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ : భీమ్‌గల్‌లో గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ విజయఢంకా మోగించడం శుభప రిణమమని, రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కనికరం మధు, యోగేశ్వర్, నర్సయ్య, కొట్టాల అశోక్, రవీందర్, లక్ష్మణ్‌గౌడ్, సంధ్య రాజు, నవీన్, మహేందర్, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరికరాల అందజేత



వైద్య పరికరాలతో సభ్యులు

ఆర్మూర్‌టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సేవ్‌లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.15 లక్షల విలువ గల వైద్యపరికరాలను అందజేశారు. ప్రజల అవసరాలు తెలుసుకున్న సేవ్‌లైఫ్ ఫౌండేషన్ సభ్యులు మెర్సిడిస్ బెంజ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రూ.15 లక్షల విలువ గల అత్యవసర చికిత్సలకు సంబంధించిన వైద్యపరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, ఆర్ఎంవో డాక్టర్ అమృత్‌రాంరెడ్డి, డాక్టర్ అజయ్, సేవ్‌లైఫ్ ఫౌండేషన్ సభ్యులు, డాక్టర్ పుష్పనంద్, డాక్టర్‌నూర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



వంటలను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మార్చి6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని ఎస్టీ బాలికల కళాశాల వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య ప్రాధాన్యతను వివరించారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. బడి మానేసిన విద్యార్థులు హాస్టల్‌లో ఉండి చదువుకోవాలని, చదువు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో పద్మాసింగ్, రమణారెడ్డి, సుజాత పాల్గొన్నారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం ఊట్‌పల్లికి చెందిన మాతంగి మహేందర్‌కు చెందిన బైక్ నవీపేటలో చోరీకి గురైందని ఏఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. గత నెల 24న పాత యూనియన్ బ్యాంకు సమీపంలో మహేందర్ తన హోండాషైన్ బైక్‌ను నిలిపిఉంచగా గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గురువారం బాధితుడు మహేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు

నవీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్‌కు చెందిన కోరే రమేష్‌పై అదే గ్రామానికి చెందిన పెద్దసాయిలు దాడిచేయడంతో రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయని ఏఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. రమేష్, పెద్దోళ్ల సాయిలుకు చెందిన ఇళ్లు పక్కపక్కనే ఉంటాయని, రెండు ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలం విషయంపై గురువారం ఉదయం ఇరువురు గొడవపడగా రమేష్ తలపై పెద్దసాయిలు కర్రతో దాడి చేశారని అన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన రమేష్‌ను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, బాధితుడి ఫిర్యాదు మేరకు సాయిలుపై కేసునమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

డొంకేశ్వర్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన డొంకేశ్వర్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. డొంకేశ్వర్ మండలం జీజీనడ్కుడ గ్రామానికి చెందిన బాద్గుణ చిన్నారెడ్డి(45) డొంకేశ్వర్ వైపు నుంచి బైక్‌పై అన్నారం వైపు వస్తుండగా కమాన్ సమీపంలో అన్నారం వైపు నుంచి వస్తున్న హర్వేస్టర్ ఢీకొట్టింది. తలకు, ఛాతికి బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. పంజాబ్‌కు చెందిన హర్వేస్టర్ డ్రైవర్ బల్వందర్ సింగ్‌పై మృతుడి తమ్ముడు బాద్గుణ దేవారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

నవీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ కళాశాల పరీక్ష కేంద్రంలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గురువారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలో నవీపేట మోడల్ కళాశాల, రెంజల్ మోడల్ కళాశాలతో పాటు రెంజల్ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, మోకన్‌పల్లి కేజీబీవీ కళాశాల, నవీపేట నవోదయ కళాశాలలకు చెందిన 353మంది విద్యార్థులకు గాను 336 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17 మంది గైర్హాజరు అయినట్లు అధికారులు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరి మృతి

మాక్లూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): గుత్ప గ్రామశివారులో 63వ జాతీయరహదారిపై విఠల్ (64) అనే వ్యక్తి రోడ్డుప్రమాదంలో మృతిచెందినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు సులెమాన్ నగర్‌కు చెందినవాడు కాగా 63వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ప్యాచ్‌వర్క్ చేయడానికి ఆరుగురు వ్యక్తులు వచ్చారు. ఇద్దరు వ్యక్తులు డంబార్ ప్లాంట్ తూకం వేయడానికి వెళ్లారు. మిగతా నలుగురు రోడ్డు దాటుతుండగా నిజామాబాద్ వైపు నుంచి ఆర్మూర్ వెళ్లే ఆర్టీసీ బస్సు విఠల్ అనే వ్యక్తిని ఢీకొట్టడంతో సంఘటన స్థలంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'మహిళలకు అండగా నిలుద్దాం'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకురాలు

బోధన్‌రూరల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు నాగమణి అన్నారు. అంతర్జాతీయ మహిళా పోరాటదినం సందర్భంగా సభలు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, పరువు హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా సభలు, ప్రదర్శనలు నిర్వహించాలని పీవోడబ్ల్యూ పిలుపునిచ్చిందన్నారు. పట్టణంలోని రాకాసిపేటలో కరపత్రాలు ఆవిష్కరించామన్నారు. మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు నామమాత్రంగా మారాయని, వీటిని వ్యతిరేకంగా మార్చి 1నుంచి 8వ తేదీ వరకు సభలు, ప్రదర్శనలు జరపాలన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళాసంఘం నాయకులు రెహేనాబేగం, లక్ష్మి, పద్మ, యాదమ్మ, పోశమ్మ, ఆరుగొండ లత, సుజాత, కమల, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



విగ్రహ ప్రతిష్ఠాపన చేస్తున్న విద్యారణ్యభారతిస్వామి

డొంకేశ్వర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలం లోని అన్నారంలో కొత్తగా నిర్మించిన లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో గురువారం హంపి విరుపాక్ష విద్యారణ్య భారతిస్వామి చేతుల మీదుగా వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య శాస్త్రోక్తంగా ధ్వజ స్తంభం, నరసింహ స్వామి, విగ్రహ ప్రతిష్ఠాపన అంగరంగా వైభవంగా జరిగింది. ఆలయ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. హంపి విరుపాక్ష విద్యారణ్య భారతిస్వామి నరసింహస్వామి విశిష్ఠ తను ప్రజలకు వివరించారు. ముందుగా మహిళలు మంగళ హార తులతో ఆయనకు ఘన స్వాగ తం పలికారు. గ్రామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాఅన్నప్రసాద వితరణ కార్య క్రమాన్ని ఏర్పాటు చేశారు.

వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

● హాజరుకానున్న బోధన్ ఎమ్మెల్యే



ధర్మోరాలో ప్రతిష్ఠాపన కానున్న వేంకటేశ్వరస్వామి దేవాలయం

మోర్తాడ్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మోరా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవా లయ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగు తాయని ముస్కు అనూప్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆలయ ప్రతిష్ఠాపన ఉ త్సవం బ్రహ్మశ్రీ డాక్టర్ అరుణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో గోపన్న తదితర పండితుల సారథ్యంలో వేదపండితులతో అత్యధిక వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. మూడురోజులు జరిగే ప్రతిష్ఠాపన ఉత్సవాలకు శుక్ర వారం బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పాల్గొంటారని అనూప్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలలో పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహాన్ని పొందాలని ఆయన కోరారు.

నేటి నుంచి సింధూర సిద్ధి వినాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు

నవీపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలలో శుక్రవారం నుంచి ఆదివారం వరకు శ్రీ సింధూర సిద్ధి వినాయక స్వామి ఆలయ జీర్ణోద్ధరణ, పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు. సింధూర సిద్ధి వినాయక స్వామి ఆలయ ఉత్సవాలతో పాటు శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి, శ్రీ రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు, పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయ పుష్కర కుంభాభిషేక మహోత్సవాలు సైతం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలలో హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి, గ్రామ పురోహితులు కృష్ణప్రసాద్ జోషి పాల్గొనడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఉత్సవాలలో భాగంగా మూడు రోజుల పాటు ఆలయంలో వివిధ కార్యక్రమాలతలో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.

భక్తిభావనతో మానసిక ప్రశాంతత

● రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి



దోమలెడ్గిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పోచారం

కోటగిరి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరు భక్తిభావన అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని దోమలెడ్గి గ్రామంలో శ్రీ రుక్మిణి, పాండురంగ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరైన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమంలో పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. భగవంతుడి కృపతో నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధి పెద్ద ఎత్తున జరిగిందన్నారు. పాడిపంటలు సుభిక్షంగా పండుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్ పటేల్, ఏజాజ్ ఖాన్, శంకర్, విఠల్, దిగంబర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



మల్లారంలోని రోడ్డు మలుపు



రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు (ఫైల్)

ప్రమాదాలకు నిలయం.. మల్లారం గండి

● గాలిలో కలుస్తున్న ప్రాణాలు ● ప్రమాదాలకు అతివేగమే కారణం! ● పట్టించుకోని అధికారులు

మోపాల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్లారం గండి ప్రధాన రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారడంతో ఆ రోడ్డు గుండా ప్రయాణించే వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈరోడ్డు గుండా నిత్యం వందల కొద్దీ వాహనాలు వస్తూ పోతుంటాయి. నిజామాబాద్ నుండి వర్ని, బాన్సువాడ, బిచ్కుంద, ఎల్లారెడ్డి, నిజాంసాగర్ గ్రామాలకు వెళ్లాలంటే ఈ దారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. ఆ గ్రామాల వాహనదారులు నిజామాబాద్ మండల కేంద్రానికి రావాలంటే ఈ దారి తప్ప మరో దారి లేదు. దీంతో వాహనాలు రద్దీ పెరిగిపోయింది. బస్సుల ప్రయాణం కూడా ఈ దారి. మల్లారం గండి అటవీ ప్రాంతం కావడంతో వచ్చిపోయే వాహనాలు తమ వాహనాలను స్పీడ్‌గా నడుపుతూ ప్రమాదాల బారిన పడి ప్రాణాలను కోల్పోతున్నారు. నెలకు రెండు మూడు ప్రమాదాలు జరుగుతున్నాయని చుట్టుపక్కల ప్రజలు వివరించారు. మల్లారం గండి ప్రధాన రోడ్డు మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. దీన్ని గమనించకుండా వాహనదారులు స్పీడ్‌గా నడుపడంతో ప్రమాదాల బారిన పడుతూ ప్రాణాలను కోల్పోతున్నారు. గండిలో జరిగిన ప్రమాదాల సమాచారం అధికారులకు ఆలస్యంగా తెలియడంతో వారు వచ్చే సరికి ప్రాణాలను కోల్పోతున్నారు. సంబంధిత అధికారులు వాహనదారులను స్పీడ్‌గా నడపవద్దని ఎన్నోసార్లు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు వివరిస్తున్నా ప్రజల్లో మార్పు రాక ప్రాణాలు కోల్పోతున్నారని అధికారులు పేర్కొంటు న్నారు. ఇప్పటికైనా వాహనదారులు మూల మలుపుల వద్ద స్పీడ్‌ను తగ్గిస్తే ప్రమాదాలను నివారించ గలుగుతామని తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● జిల్లా సీనియర్ న్యాయాధికారి పద్మావతి ● టీయూ లో ఘనంగా అంతర్జాతీయ మహిళ దినోత్సవం



జిల్లా న్యాయాధికారిని సన్మానిస్తున్న టీయూ వీసీ యాదగిరి రావు



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి పద్మావతి

డిచ్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మహిళలు సమాజంలో అన్ని రంగాల్లో రాణించాలని విద్యారంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలని నిజామాబాద్ లీగల్ సెల్ అథారిటీ సీనియర్ న్యాయాధికారి పద్మావతి అన్నారు. మహిళా దినోత్సవ వేడుకలు ఉమెన్ సెల్ డైరెక్టర్ భ్రమరాంబిక అధ్యక్షతన గురువారం నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా జడ్జి పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు సైబర్ నేరాలకు గురవుతున్నారని, ఈ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. అంకురిత దీక్షతో సాధించిన లక్ష్యాలు దేశాన్ని ఆర్థికంగా, రాజకీయంగా సామాజికంగా ముందుకు తీసుకెళ్తున్నయన్నారు. టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొ.యాదగిరిరావు మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో మహిళలు ప్రవేశించని రంగం లేదని అన్ని రంగాల్లో మహిళలను అగ్రభాగన నిలిపేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నయన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నేషనల్ ఉమెన్ డెవలప్‌మెంట్ మహిళల ఆరోగ్యం సంక్షేమం సామాజిక భద్రత పెరిగిందన్నారు. మహిళల సమగ్ర అభివృద్ధి తోనే వికసిత భారత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. దేశంలో రాష్ట్రపతి నుంచి ముఖ్యమంత్రుల వరకు మహిళలు రాణిస్తున్నారని తె లిపారు శాస్త్ర సాంకేతిక రంగంతో పాటు పరిపాలన రంగంలో ప్రపంచం గుర్తించేలా కొనసాగడం దేశానికే గర్వకారణమన్నారు. మహిళలకు ఇస్తున్న ప్రాధన్యతతో అంతర్జాతీయంగా భారత్ కు ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. అతిధిగా హాజరైన రిజిస్ట్రార్ యాదగిరి మాట్లాడుతూ... స్త్రీ, పురుషుల సహకారంతోనే దేశం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రవీన్ మామిడాల, అధ్యాపకులు విద్యవర్ధిని, అరుణ, లావణ్య, ఆరతి, అపర్ణ, శిరీష, నందిని, నీలిమా, శాంతబాయి, కిరణ్మయి, ప్రసన్నరాణి, స్రవంతి పాల్గొన్నారు.

పేదోడి ఫ్రిజ్‌లు సిద్ధం



వేసవి కాలం కోసం సిద్ధమైన పేదల ఫ్రిజ్‌లు



మట్టి కుండలు సిద్ధం చేస్తున్న కుమ్మరి

మద్నూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం వచ్చిందంటే చల్లటి నీళ్ల కోసం తాపత్రేయం పడుతున్న పేదల కోసం కుమ్మరులు నీటి కుండలను సిద్ధం చేస్తున్నారు. మట్టి కుండలు అనాదిగా వాడుకలో ఉన్నాయి. అల్యూమినియం, స్టీలు ఇతర పాత్రలు వాడుకలోకి రావడంతో మట్టి కుండలకు ఆదరణ క్రమక్రమంగా తగ్గింది. ఆధునిక వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు ప్రజలను చుట్టూ ముడుతున్నాయని భావనతో మళ్లీ ప్రజలు మట్టి కుండల వైపు మొగ్గు చూపుతున్నారు. చాలా చోట్ల వంటలకు, తాగునీటికి మట్టి కుండలనే వాడుతున్నారు. వేసవిలో మట్టికుండల్లో నీళ్ల తాగడానికి ఎక్కువగా ప్రజలు ఇష్టపడుతున్నారు. ఫ్రిజ్‌లు అధిక శాతం మందికి ఉన్న ఫ్రిజ్ నీరు తాగితే అనారోగ్యం భారిన పడతామని కుండ నీటిని ఆశ్రయిస్తున్నారు. కుండ నీరు వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు శరీరానికి ఉపశమనం కలిగిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచి ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు కుండలను, పూజలను పాత్రలను ఆశ్రయి స్తున్నారు. చలి వేంద్రాల్లో సైతం అత్యధికంగా మట్టి కుండలనే వాడుతున్నారు. ఈ కొండల్లో నీరు తాగితే దాహం తీరడంతో అల్క లీన్, లక్షణాలు నీటి పీహెచ్ సాయిలులను సమతుల్యం చేస్తాయ ని పలువురు అభిప్రాయపడుతున్నారు.

● మట్టికుండ నీళ్లు

ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠం

మట్టికుండ నీరు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమని చెప్పవచ్చు. ఈ నీరు తాగడం వల్ల కడుపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యాన్ని కలిగిస్తాయి. అదేవిధంగా ఖనిజాలు, లవణాలు కూడా అందుతాయి. మట్టి కుండల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని పలువురు పేర్కొంటున్నారు. మట్టి కుండలను చేతితో తయారు చేసి తక్కువ ఉష్ణోగ్రతలతో కాల్చుతామని కుమ్మరులు చెబుతున్నారు. ఏదిఏమైనా వేసవి కాలం వచ్చిందంటే కుమ్మరులకు చేతినిండా పని కలుగుతుందని పేర్కొంటున్నారు.

టీయూ కంప్యూటర్ సైన్స్ డీన్‌గా సంపత్ కుమార్ నియామకం



ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ సంపత్ కుమార్‌కు నియాయక పత్రం అందజేస్తున్న రిజిస్ట్రార్

డిచ్‌పల్లి,మార్చి 6 (ఆం ధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ డీన్‌గా ప్రొ.సంపత్ కుమార్‌ను నియామిస్తూ గురువారం వీసీ యాదగిరి రావు, నియామక ఉత్తర్వులు అందజేశారు. సంపత్ కుమార్ డిపార్టుమెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్‌లో కొనసాగుతున్నారు. ప్రస్తుతం వర్సిటీలో డైరెక్టర్ ఆఫ్ అడ్మినిషన్‌గా, పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో అప్లైడ్ స్టాటటిక్స్ హెడ్‌గా బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, పీ ఆర్వోగా వైస్ ప్రిన్సిపాల్, విధులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియామకం చేసినందుకు వీసీ, రిజిస్ట్రార్‌లకు ధన్యావాదాలు తెలిపారు.

టీయూ వైస్ ప్రిన్సిపాల్‌గా లక్ష్మణ చక్రవర్తి నియామకం

డిచ్‌పల్లి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా లక్ష్మణ చక్రవర్తిని నియమిస్తూ వీసీ యాదగిరి రావు నియామక ఉత్తర్వులు అందజేశారు. తెలుగు విభాగంలో విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ చక్రవర్తి, గతంలో పాఠ్య ప్రణాళిక సంఘ చైర్మన్, ప్లేస్‌మెంట్ డైరెక్టర్ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ, రిజిస్ట్రార్‌లకు ధన్యవాదాలు తెలిపారు.



వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ చక్రవర్తికి నియామకపత్రం అందజేస్తూ..



భీమ్‌గల్ టింబర్ డిపోలో అక్రమంగా టేకు దుంగలు తీసుకువచ్చి డంప్ చేస్తున్న దృశ్యం

యథేచ్ఛగా అక్రమ కలప రవాణా

● పేరుకే టెంబర్ డిపో లోపల మొత్తం జీరో మాల్

● వాల్టా చట్టానికి తూట్లు ● పట్టించుకోని అటవీ శాఖ అధికారులు

భీమ్‌గల్‌రూరల్, మార్చి6(ఆంధ్రజ్యోతి): అడవుల సంరక్షణకు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. అటవీ శాతాన్ని రేట్టింపు చేయడానికి లక్షల రూపాయలు వెచ్చించి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతుంది. ఫారెస్టులోనే నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచి చెట్లను నాటుతున్నారు. ఇందుకు 50శాతం చెట్లు కూడా పెరగడం లేదు. నిధులు ఉన్న చెట్లను రక్షించడంలో అటవీ శాఖ అధికారులు విఫలం అవుతున్నారు. పెరుగుతున్న కాస్తా చెట్లను పెంచడంలేదు. నిధులు ఉన్న చెట్లను అక్రమార్కులు యథేచ్ఛగా నరికి సోమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఫారెస్టుకు సంబంధించిన భూమిలో ప్రతీ సంవతసరం టెకు, నల్ల మద్ది, నీలగిరి, కనుగా వంటి 20రకాల మొక్కలను నాటుతున్నారు. మండలంలోని కారేపల్లి, దేవక్కపేట్, రహత్‌నగర్, మెండోరా, దేవన్‌పల్లి, భీంనగర్ గ్రామాల్లో అటవీ శాఖ భూములు వేల ఎకరాల్లో ఉంది. ఇందులో చాలా వరకు భూమి కబ్జాకు గురైంది. ఫారెస్టు భూమిని కబ్జా నుంచి కాపాడడంలో అధికారులు విఫలమవుతున్నారు. కొంత మంది అక్రమార్కులు ధనార్జనే ధ్యేయంగా చెట్లను రాత్రి వేళల్లో నరికి కలప వ్యాపారులకు రవాణా చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పుట్ట గొడుగుల్లా కలప కర్మాగాలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారుల నుంచి ఎ లాంటి అనుమతి లేకుండా ఈ కర్మాగాలు యథేచ్ఛగా నడిపిస్తున్నారు. వాటిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నెలనెలా మామూళ్లు తీసుకుని అక్రమార్కులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే మండ లంలో సుమారు పది టింబర్ డిపోలు ఉన్నాయి. అవి పేరుకే మాత్రమే లోపల మాత్రం జీరో కట్టే ఉంటుంది. కలప స్మగర్ల దగ్గర టేకు దుంగలను తక్కువ రేటుకే కొని గృహ నిర్మాణాల కోసం దర్వాజాలు, తలుపులు, కిటికీలు, ఇతర పరికరాలను తయారు చేసి కోట్లు రూపాయలు సంపాదిస్తున్నారు. భీమ్‌గల్ మండలంలో నుంచి ఆర్మూర్, నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్, మెట్‌పల్లి, కోరుట్ల కరీంనగర్, దాకా ఇక్కడి నుంచే ఫర్నిచర్‌ను వ్యాపారులు తయారు చేసి పంపుతారు వాల్టా చట్టం ప్రకారం అటవీ శాఖ అధికారుల నుంచి ఇలాంటి అనుమతి లేకుండా చెట్లను ఇసుక మొరం తీయరాదు. కానీ అధికారుల ఆలసత్వంతో ఈ అక్రమ దందా యథేచ్ఛగా నడుస్తోంది. జిల్లా అధికారులు స్పందించి ఈ అక్రమ కలప రవాణాకు అడ్డుకట్ట వేసి అడవులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అటవీ చెట్లు నరికితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం

● బి.దేవిదాస్. ఫారెస్టు డిప్యూటీ రెంజ్ అధికారి



అటవీ నుంచి అక్రమంగా చెట్లు నరికితే వాల్టా చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. రైతులు పట్టా భూమిలో పెంచిన టేకు చెట్లు నరకాలంటే మా అనుమతి తీసుకోవాలి. ఫారెస్టు భూమి కబ్జా చేస్తే కేసులు నమోదు చేస్తాం. అలాగే టింబర్ డిపోలపై సామిల్, కలప కార్మాణాలపై నిఘా పెంచుతాం. ఎక్కడైనా కలప నిల్వలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే కలపను స్వాధీనం చేసుకుని నిందితులపై చర్యలు తీసుకుంటాం.

మొక్క మొక్కకు నీటి బొట్టు



వాటర్ బాటిల్‌లో నీరు నింపి మొక్కకు నీరందిస్తున్న దృశ్యం

పెద్దకొడప్‌గల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం అసలే వేసవి కాలం నీరు దొరకడమే గగనం. గత కొద్ది రోజుల కిందటి వరకు సమృద్ధిగా నీరు పోసిన బోరుబావులు అడుగంటుతున్నాయి. ఉన్న నీటిని పొదుపుగా వాడు కుంటేనే భవిష్యత్తులో నీరు లభిస్తుంది. ఈ ఆలోచనలో భాగంగానే పిట్లం నుంచి పెద్ద కొడప్‌గల్ మండలం వెళ్లే 161వ జాతీయ రహదారి పక్కన హైవే సిబ్బంది మొక్కలను నాటుతున్నారు. నాటిన మొక్కను రక్షించాలంటే నీరు పోయాలి. ఇలా పోసిన నీరు వృథా కాకుడదనే ఉద్ధేశంతో హై వే సిబ్బంది నాటిన మొక్కకు పక్కన ఒక ప్లాస్టిక్ బాటిల్ కింది భాగాన్ని కట్ చేసి అందులో నీరు నింపి బొట్టు బొట్టుగా నీరు పడేలా మూత వైపు భాగంకు సన్నని వైపు అమర్చారు. దీంతో నీరు వృథా కాకుండా బొట్టు బొట్టుగా మొక్కను చేరుతుంది. రహదారి వేల్లే వాహనదారులు ఈ దృశ్యాన్ని చూస్తు హైవే సిబ్బంది ఆలోచనను మెచ్చుకుంటున్నారు. ఈ విధంగా మొక్కలకు నీరు అందించడం వలన తమకు సమయం ఆదా కావడంతో పాటు, నీటిని పొదుపుగా వాడు కోవడానికి వీలవుతుందని హైవే సిబ్బంది తెలిపారు.

10వ తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

పెద్ద కొడప్‌గల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ప్రతీ సంవత్సరం వార్షిక పరీక్షలకు ముందుగా విద్యార్థుల శక్తి సామర్థ్యాలు తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే మండలంలోని పెద్ద కొడప్‌గల్, వడ్లం, కాటేపల్లి, గురుకుల పాఠశాలల్లో గల విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలకు హాజరయ్యారు. విద్యార్థుల శక్తి సామర్థ్యాన్ని తెలుసుకుని వెనుకబడిన విద్యార్థులకు వార్షిక పరీక్షల వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరీక్షల్లో పాస్ అయ్యేలా తీర్చిదిద్దుతామన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న తిరుమల ప్రసాద్

దోమకొండలో స్టాక్ రిజిస్టార్ తనిఖీ

దోమకొండ, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు ముత్యంపేట పీఏసీఎస్, ప్రైవేటు ఎరువుల దుకాణాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ తనిఖీ చేశారు. నిల్వలు, అమ్మకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏ అపర్ణ, ఏవో మణిదీపిక, బాల్‌రెడ్డి, నవీన్, లింగం, ప్రమోద్, గూలాం ఉన్నారు.

ప్రారంభమైన ద్వితీయ సంవత్సర పరీక్షలు

కామారెడ్డి టౌన్, మార్చి 6(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం వార్షిక పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. జిల్లాలోని 38 కేంద్రాల్లో 7,949 మంది విద్యార్థులకు గాను 7,789 మంది విద్యార్థులు హాజరు కాగా 160 మంది గైర్హాజరయ్యారు. ఇందులో 7,278 మంది విద్యార్థులు జనరల్ అభ్యర్థులకు గాను 7,137 మంది హాజరయ్యారని 141 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. ఒకేషనల్ కోర్సుల్లో 671 మందికి గాను 652 మంది హాజరు కాగా 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.



చిన్నారులకు పేస్టులను అందజేస్తున్న వైద్యురాలు

విద్యార్థులు దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బాన్సువాడ టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ప్రతిరోజూ దంతా లను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యుడు సంతోష్‌రెడ్డి తెలిపారు. దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా గురువారం బాన్సువాడ రాజారాం దుబ్బ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దంతవైద్య నిపుణులు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పేస్టు, పెన్నులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లచ్చిరాం, వైద్యులు సంతోష్‌రెడ్డి, స్వాతి , అనిల్‌రెడ్డి, సౌజన్య, సుహాసిని, జీవన్, సందీప్, ఉపాధ్యాయులు రమేశ్‌గౌడ్, విజయలక్ష్మీ తదితరులున్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

రాజంపేట, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండారంలో గురువారం అక్రమమద్యం అమ్ముతున్న బెల్ట్‌దుకాణాలపై దాడులు నిర్వహించినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ దీపిక తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ అక్రమమద్యం అమ్ముతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించి 4.48 లీటర్ల ఐఎంఎల్, 3.9 లీటర్ల బీరును స్వాధీనం చేసుకుని అక్రమ మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది జీవన్, మహేష్, బాలరాజు పాల్గొన్నారు.

ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మ దహనం

నిజామాబాద్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేసిన ఎంపీ అర్వింద్ దిష్టిబొమ్మను గురువారం నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. నగర మాజీ కార్పొరేటర్ గడుగు రోహిత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం గడుగు రోహిత్ మాట్లాడుతూ నవోదయ పాఠశాల ఏర్పా టు విషయంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిపై ఎంపీ అర్వింద్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బోధన్‌లో అన్ని వర్గాల వారికి అనుకూలంగా ఉంటుందనే ఉద్దేశంతో నవోదయ పాఠశాల ఏర్పాటుకు సుదర్శన్‌రెడ్డి స్థలం చూపించారని కానీ అర్వింద్ ఆయనపై అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. మరోసారి సుదర్శన్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మునీర్, అబ్బు, తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డిపై అర్వింద్ వ్యాఖ్యలు అర్థరహితం..

జిల్లాలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని ఆయనపై ఎంపీ అర్వింద్ వ్యాఖ్యలు అర్థరహితం అని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణురాజ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు తెలంగాణ యూనివర్సిటీ, మెడి కల్ కళాశాల ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సుదర్శన్‌రెడ్డి హయాంలోనే అయ్యాయని అన్నారు. నవోదయ పాఠశాల మంజూరు విషయంలో ఎంపీ వ్యాఖ్యలు సరికాదని పార్లమెంట్ సభ్యుడిగా ఉండి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు నరందీప్, కిరణ్‌రెడ్డి, శివ, సాయికిరణ్ పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డిని విమర్శించే హక్కు ఎంపీకి లేదు..

40 ఏళ్లుగా కాంగ్రెస్‌లో ఉండి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని విమర్శించే హక్కు ఎంపీ అర్వింద్‌కు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కు లేదని సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వైసాక్షి సంతోష్ అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అందులో భాగంగానే బోధన్‌లో సుదర్శన్‌రెడ్డి జవహర్ నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని అనుకున్నారని కానీ ఎంపీ అర్వింద్ విమర్శలు చేయడం సిగ్గుచేటని వారన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

డిచ్‌పల్లి, మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని నడిపల్లి శివారులో గురువారం డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా పడింది. స్థానికులు వెంటనే కారులో ఉన్న నూతన దంపతులను బయటికి తీసి స్వల్ప గాయాలతో ఉన్న వారిని ఆస్పత్రికి తరలించారు.

బీజేపీ నాయకుల సంబురాలు



పెద్దకొడప్‌గల్‌లో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు



మాచారెడ్డిలో సంబురాలు చేసుకుంటున్న నాయకులు



రాజంపేటలో టపాకాయలు కాలుస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ రోడ్డులో బీజేపీ నాయకులు గురువారం టపాకాయలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డి విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. తెలంగాణలో మార్పు మొదలైందని ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినా బీజేపీ అభ్యర్థులు గెలుస్తారని అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ సైతం బీజేపీ ఖాతాలో పడడం సంతోషకరమైన విషయమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి, స్టేట్ కౌన్సిల్ మెంబర్ విపుల్‌జైన్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, నాయకులు నరేందర్, రవీందర్, విజయ్, రాజు, వేణు, రఘు, ప్రతాప్, ముదాం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బస్టాండ్ కూడలిలో టపాసులు కాల్చి మిఠాయిలు పంచుకు న్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బాలాజీ పటేల్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు సంజయ్ పటేల్, బీజేవైఎం అధ్యక్షుడు సుభాష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జేతిలాల్, యువ నాయకుడు కృష్ణ పంతులు, ప్రేమ్‌సింగ్, అశోక్ పాల్గొన్నారు.

మాచారెడ్డి : పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోవడంతో పాల్వంచ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు తినుపించుకుంటూ ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అనిల్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాలరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి నరసింహచారి, ప్రధానకార్యదర్శులు శ్రీనివాస్, నరేష్,బీజేవైయం అధ్యక్షుడు సత్యం,కిసాన్‌మోర్చా అధ్యక్షుడు నర్సారెడ్డి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : మండల కేంద్రంలో బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి గెలుపు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నాయకులు టపాకాయాలు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి మద్దతు పలికిన ప్రతి పట్టభద్రునికి ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. ప్రతి పట్టభద్రుడి వద్దకు వెళ్లి బీజేపీ సిద్ధాంతాలను వివరించిన కార్యకర్తల కృషి ఎనలేనిదని తెలిపారు. బీజేపీ వైపు అన్ని వర్గాల ప్రజలు చూస్తున్నారనేది ఈ గెలుపుతో స్పష్టం అవుతుందని, వచ్చే ఎన్నికల్లో స్థానిక సంస్థల్లోను సత్తాచాటుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా జనరల్ సెక్రటరీ గంగారెడ్డి, సీనియర్‌నాయకులు పిట్లశ్రీను, సతీష్‌రెడ్డి, బల్లకిషోర్, గ్రామ అధ్యక్షుడు రాము, సాయిరెడ్డి, రాజిరెడ్డి, అరుణ్‌గౌడ్, కమ్మరి నాగరాజు, బాలయ్య, సంతోష్, బాలనర్సు పాల్గొన్నారు.

బిచ్కుంద : మండల కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి ప్రధాన వీధుల గుండా బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి ఘనవిజయం సాధించడం హర్షణీయమని అన్నారు. ఇక రాష్ట్రంలో బీజేపీకి ఎదురులేదని స్థానిక సంస్థల్లోను పెద్దఎత్తున సీట్లు కైవసం చేసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు విష్ణు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీబీపేట : మండల కేంద్రంలోని ప్రధానచౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కొమురయ్యల విజయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నామని తెలిపారు. వీరిద్దరి గెలుపునకు కృషిచేసిన ప్రతినాయకుడు, కార్యకర్తల కృషి ఎనలేనిదని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు రంజిత్‌గౌడ్, శ్రీనివాస్,శివ, రాముగౌడ్, సురేష్ పాల్గొన్నారు.

బాన్సువాడ టౌన్ : పట్టభద్రుల ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడంతో గురువారం బాన్సువాడలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బాణాసంచా పేలుస్తూ మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ బీజేపీపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించిన ఉద్యోగులకు, పట్టభద్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాన్సువాడ బీజేపీ నాయకులు తదితరులున్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు అరుణతార



బాన్సువాడలో ...

చెత్త సేకరణ పరిశీలన

సదాశివనగర్,మార్చి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మాజీవాడి గ్రామపంచాయతీలో శానిటేషన్ కార్యక్రమంలో భాగంగా ట్రాక్టర్ ద్వారా తడిపొడి చెత్త సేకరణను డీఎల్‌పీఓ శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామాలలో అన్ని వీధులు తిరిగి శానిటేషన్ పనులు పరిశీలించి ప్రజలకు తడి పొడి చెత్త వేరువేరుగా చేసి అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

ఉచిత దంత వైద్యశిబిరం

కామారెడ్డిటౌన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం డెంటిస్ట్ డేను ఘనంగా నిర్వహించారు. అనతరం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓరియంటల్ పాఠశాలలో 10 మంది డెంటల్ వైద్యుల బృందం ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు దంతాల పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం మందులు అవసరం ఉన్న విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు అభిషేక్‌రెడ్డి, కవిత, సాజిద్, సారా, క్రాంతి, నాగరాజ్, శ్రావణ్, రాకేష్, ప్రవీణ్, మౌనిక, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళిరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు లక్ష్మీనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు,సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు దంతపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



బాధితులకు నగదు సహాయం చేస్తున్న నాయకులు

బాధితులకు ఆర్థిక సహాయం అందజేత

బీర్కూర్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గత నెల 27వ తేదీన అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మూడుఇళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుబట్టలు మినహా బాధితులు సర్వం కోల్పోయారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు మియ్యాపురం శశికాంత్ బాధితులకు ఆరు వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదంలో నిరుపేదలైన పిడుగు శాంతవ్వ, సాయవ్వ, గంగామణిలకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి అందాల్సిన సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సందీప్ పాటిల్, కొరిమే రఘు, పృథ్వీ, రాజు, ప్రశాంత్, బస్వంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

మోపాల్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో గురువారం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. మాజీ సుదర్శన్‌రెడ్డి జక్రాన్‌పల్లిలో ఉన్న నవోదయ పాఠశాలను బోధన్ నియోజకవర్గానికి తీసుకెళ్లడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం పై మండిపడ్డారు. రూరల్ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక సుదర్శన్‌రెడ్డి నవోదయ పాఠశాలను బోధన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయన చేస్తున్న ప్రయత్నాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పద్మారెడ్డి, మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, మహేష్, దిల్‌దార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంజిరెడ్డి గెలవడంతో విజయోత్సవ సంబరాలను నిర్వహించారు.

సిరికొండ: ఎంపీ అర్వింద్ జిల్లాకు నవోదయ విద్యాలయం మంజూరు చేయిస్తే దానిని నిజామాబాద్ రూరల్‌లో ఏర్పాటు చేయాల్సి ఉండగా బోధన్ ఎమ్మెల్యే అడ్డుకొని తన నియోజకవర్గానికి తరలించుకపోవడానికి నిరసనగా మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంజీవరెడ్డి, రాజేశ్వర్, సాయాగౌడ్, లింబాద్రి గౌడ్, రామస్వామి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం తప్పని ఇబ్బందులు



నీటికోసం బోరు బావి తవ్వుతున్న దృశ్యం

పెద్దకొడప్‌గల్, మార్చి 06 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండుతుండడంతో భూగర్భజలాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. నెలరోజుల్లో పంటచేతికి వస్తుందని రైతన్న సంబరపడే తరుణంలో వ్యవసాయ బోరుబావులు ఎండిపోవడంతో రైతన్నలు సాగునీటి కోసం భగీరథ యత్నం చేస్తున్నారు. పక్కన ఉన్న తోటి రైతుల బోరుబావుల నుంచి కొందరు నీరు తీసుకుంటుంటే మరికొందరు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగానే చేతికొచ్చిన పంటను కాపాడుకోవాలనే తపనతో కొత్తగా బోరు బావులను తవ్వకుంటున్నారు. ఇప్పటికే పంటసాగు కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసి చివరి ప్రయత్నంగా అప్పు చేసి మరి కొత్తగా బోర్లు వేస్తున్నారు. అయినప్పటికీ బోరుబావులలో నీరు పడకపోవడంతో నైరాశ్యానికి గురవుతున్నారు.

అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో అనుమతు లు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ఓ ప్రైవేటు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు గురువారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఓ ప్రైవేటు పాఠశాలకు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేకున్నా బిల్డింగ్ నిర్మాణం ఇంకా పూర్తికాకముందే అడ్మిషన్లు చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం అన్నారు. అడ్మిషన్లతో పాటు విద్యార్థుల నుంచి 50శాతం ఫీజులు ముందే వసూలు చేస్తున్నారని, ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ప్రచారం నిర్వహిస్తున్న హోర్డింగ్‌లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు సుబోధ్, కుశాల్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాల్లో ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, సంస్కృతం, ఉర్దూ భాషా సబ్జెక్టుల పరీక్షను ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,343 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 15,923 మంది పరీక్షలకు హాజరుకాగా 420 మంది గైర్హాజరయ్యారు. నిజామాబాద్ ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల-బి సెంటర్‌లో ఓ విద్యార్థి చీటీలు రాస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకొని మాల్‌ప్రాక్టిస్ కేసు నమోదు చేశారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ధర్మారంలోని సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును ఆయన గమనించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఐఈవో రవికుమార్ నగరంలోని ఖిల్లా ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల-ఏ, బి సెంటర్లు, కంఠేశ్వర్ ఎస్ఆర్ కళాశాల, కాకతీయ జూనియర్ కళాశాల ఏ, బి సెంటర్లలో, మహిళా కాకతీయ జూనియర్ కళాశాల సెంటర్లను తనిఖీ చేశారు.

చెరువులో పడి మహిళ మృతి

సిరికొండ, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర శివారులోని ఎల్లమ్మ చెరువులో పూజ (36) అనే మహిళ నీటిలో పడి మృతి చెందిం దని గురువారం ఎస్సై తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరి జిల్లా సారుపల్లి గ్రామానికి చెందిన ఈ మహిళ కుటుంబ సభ్యులు వాల్గొట్ గ్రామంలో మేస్త్రీ పని కోస వలస వచ్చారు. పూజ తన తల్లి వారి ఇంటి కి వెళ్తానని చెప్పి బయలుదేరిందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో గల గిరిజన సంక్షేమ శాఖ వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను 5వ తరగతిలో 20 (10 మంది బాలురు, 10 మంది బాలికలు) ఎంపిక కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలు మోటార్ క్వాలిటీస్ (బ్యాటరీ పరీక్షలు), ఆంత్రోపోమెట్రిక్ (ఎత్తు మరియు బరువు), వైద్య స్థితి నిర్వహించడానికి తాత్కాలిక షెడ్యూల్‌ను సూచనలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. దరఖాస్తు ఫారాలు జిల్లాలోని సుదపల్లి, సిరికొండ, వర్ని గిరిజన ఆశ్రమ పాఠశాలలో, జిల్లా కలెక్టరేట్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు.



సినిమా గైడ్ కామారెడ్డి

కామారెడ్డి

దర్శన్ - ఛావా
ప్రియా 70 - రిటర్న్ ఆఫ్ దా డ్రాగన్
ప్రియా 35 - శబ్దం

బాన్సువాడ

మహేశ్వరి - మజాకా
వెంకటేశ్వర - రాక్షస



చికెన్ ధరలు

రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	110	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

